

సాక్షి బాపట్ల

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



సందర్శకులకు అనుమతి

యద్దనపూడి: కొండవీడు కోటకు సందర్శకులను ఆదివారం నుంచి అనుమతించనున్నారు. విరిగి పడిన బండరాళ్ల తొలగింపు పనులు శనివారం చేపట్టారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటి మట్టం శనివారం 522.30 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 23,030 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,350 విడుదల చేస్తున్నారు.

సత్రశాలలో కార్తిక పూజలు

రెంటచింతల: పల్నాడు జిల్లా సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కార్తిక పూజలు నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున కార్తిక దీపాలు వెలిగించి పుణ్య స్నానాలు చేశారు.



కష్టాల సుడిగుండంలో వల

- మత్స్యకారులు విలవిల
- వరస తుపాన్లు, వర్షాలతో అవస్థలు
- 23వ తేదీ వరకు సముద్రంలో వేట నిలుపుదల

తీరం వెంట హైలెస్సో హైలెస్సో.. అంటూ గంగపుత్రులు ఉత్సాహంగా మొదలు పెట్టే వేట ప్రస్తుతం ఆపసోపాల మధ్య సాగుతోంది. గత నెలన్నర నుంచి వాయుగుండాలు, తుపాన్ల కారణంగా వర్షాలు కురుస్తుండటంతో వేట సాగక మత్స్యకారుల బతుకులు భారంగా మారాయి. వేట తప్ప మరో పని తెలియని గంగపుత్రులు కష్టాల 'సుడి'గుండంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు.

చీరాల: బాపట్ల జిల్లాలోని చీరాల, బాపట్ల, రేపల్లె, పర్చూరు నియోజకవర్గంలో కొంత సముద్రతీరం ఉంది. ఈ తీరం వెంట అనేక మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 50 వేల మంది మత్స్యకారులున్నారు. తీరప్రాంత గ్రామాల్లో 1549 ఇంజన్ బోట్లు, 2283 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. తీర ప్రాంతాల్లో 20 వేల మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. అయితే గత నెల నుంచి తుఫాన్లు, భారీ వర్షాలతో గంగపుత్రులు పుట గడవక ఆపసోపాలు పడుతున్నారు. తుపాన్లు, క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో నిలిచిన వేట ఫలితంగా తీరం ఒడ్డున బోట్లు, వలలను నిలుపుదల చేశారు. దీంతో గంగపుత్రులు జీవనానికి అవస్థలు పడుతున్నారు.

22 వరకు సముద్రంలో వేట నిలుపుదల..

భారత వాయుసేన(సూర్యలంక) సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి 22వ తేదీ వరకు మత్స్యకారులు వేట చేయవద్దని ఆదేశించారు. ఈ మేరకు వాడరేవు, రామాపురం తదితర తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకార సొసైటీ నాయకులు, బోటు యాజమానులు, సంప్రదాయ మత్స్యకారులకు ప్రభుత్వం విడుదల చేసిన నోటీసులను చీరాల ఎఫ్‌డీఓ రాజ్‌కుమార్ అందించారు. కలెక్టర్ ఆదేశాలను పాటించి క్షిపణి ప్రయోగాలు చేసే సమయంలో వేట నిలుపుదల చేయాలని, ఆదేశాలను విస్మరించి సముద్రంలో వేట సాగించే వారిపై చర్యలు తప్పవని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.



నెలాఖరు వరకు వేట లేకపోవడంతో జెట్టీ వద్ద నిలిపిన పడవలు

వరస విపత్తులతో సాగని వేట..

ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ నెలలో సముద్రంలో మత్స్య సంపద అధికంగా దొరుకుతుంది. అయితే గత నెలరోజుల నుంచి తుపాన్లు, వర్షాల కారణంగా వేట సాగక అటు మత్స్యకారులు, ఇటు మత్స్య ఉత్పత్తులపై ఆధారపడిన కుటుంబాలు పూట గడవక అవస్థలు పడుతున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా మత్స్యకారుల జీవనానికి అడ్డంకి ఏర్పడింది. ఇక్కడి మత్స్య సంపదను బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, విజయవాడ, కేరళ, ఈరోడ్, ఒడిశా ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. గత నెల నుంచి సముద్రంలో వేట సరిగా లేకపోవడంతో మత్స్య ఉత్పత్తులు ఎగుమతి లేకుండా పోయింది. ఒక్కో బోటుకు ఆరుగురు చొప్పున మత్స్యకారులు డీజిల్ పోయించుకొని రూ.20 వేలు ఖర్చు చేసి వేటకు వెళ్లినా కనీసం డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

చేప పడదు.. పూట గడవదు..

సాధారణంగా వాడరేవు మత్స్యకారులు కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా రామాయపట్నం వరకు వేటకు వెళ్లి గురకా, పాములు, బొంత, కూనాము, వంజరం, పండుగప్పలు లాంటి చేపలను పట్టుకొస్తుంటారు. కానీ రెండు నెలల నుంచి బోట్లను, వలలను తీరం ఒడ్డున నిలుపుదల చేసి వేట లేక కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్నారు.



తుఫాన్‌తో ఉధృతంగా మారిన వాడరేవు తీరం

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు..

తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని సూచనలివ్వడంతో మత్స్యకారులు ఎవరు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశాం. అలానే సూర్యలంకలో క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో ఈనెల 23 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదు. వర్షాలు తగ్గి సాధారణ స్థితికి వచ్చేంత వరకు తీర ప్రాంత గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

–జీవిగుంట ప్రభాకరరావు, తహసీల్దార్, చీరాల

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం పంట నష్టపరిహారం అందిస్తుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని కిష్కింధపాలెం, తడికలపూడి, గుంటూరు గూడెం, చింతమోటు, పెసర్లంక, పెదలంక గ్రామాలలో శనివారం పర్యటించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న వాణిజ్య పంటలతోపాటు, మినప పంటను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, మిచాంగ్ తుఫాన్ వలన రైతులకు నష్టం జరిగినట్లు చెప్పారు. నిరంతం శ్రమించి పండించిన పంటలు తుఫాన్ ప్రభావంతో ఎందుకూ పనికిరాకుండా పోవడంతో రైతాంగానికి తీవ్ర నష్టం ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతి రైతుకు నష్ట పరిహారం అందజేస్తుందని చెప్పారు. గతంలో వరదలు, తుపానులు కారణంగా ఏర్పడిన పంట నష్టానికి తమ ప్రభుత్వం రైతులకు సకాలంలో పంట నష్టపరిహారం అందజేసి రైతాంగాన్ని ఆదుకుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. ఇప్పటికే ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులకు పంట నష్ట వివరాల నమోదు వ్యవహారంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. పంట నష్టపరిహార నమోదు బృందాలు ఎటువంటి వివక్ష చూపకుండా పంట కోల్పోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేసి తుది జాబితాను ప్రభుత్వానికి అందజేసే విషయంలో నిబద్ధతతో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన దృష్టికి రైతులు స్థానికంగా నెలకొని ఉన్న పలు సమస్యలను తీసుకురావడంతో తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కిష్కింధపాలెం, తడికలపూడి సర్పంచులు గుంటూరు నీలాంబరం, సూరపనేని వెంకటేశ్వరరావు, వెల్లటూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ గుమ్మడి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాదెండ్ల నరేంద్ర, వెనిగళ్ల శ్రీనివాసరావు, ముత్తిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.



కిష్కింధపాలెం అరటి తోటలను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, బౌడా చైర్మన్ దేవినేని

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

18 జిల్లాల నుంచి జట్ల రాక

మార్టూరు: రాష్ట్ర స్థాయి 42వ షూటింగ్ బాల్ అండర్–19 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక వివేకానంద నెక్స్ జెన్ పాఠశాలలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని 18 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. మొదటి రోజు బాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో గుంటూరు, ప్రకాశం జిల్లా జట్ల మధ్య, విశాఖపట్టణం, చిత్తూరు జిల్లా జట్ల మధ్య, అనకాపల్లి కడప జిల్లా జట్ల మధ్య పోటీలు నిర్వహించగా గుంటూరు, చిత్తూరు, అనకాపల్లి జిల్లాల జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు మహేష్, బాపట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఐ బాబురావు, ఉపాధ్యక్షులు వేలూరి కృష్ణమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.



షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ నాయకులు

న్యూస్‌రీల్

పల్నాటి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆహ్వానించారు. పల్నాటి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టరేట్‌లో పీఠాధిపతి శనివారం అందించారు. 12వ తేదీ నుంచి పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని పీఠాధిపతి తెలిపారు. గత ఏడాది మందపోరు నాడు బ్రహ్మనాయుడు చాపకూడు సహపంక్తి భోజనాల అమలు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్ కుమార్ కూడా పీఠాధిపతి వెంట ఉన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శనివారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ వేదపండితులు తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకారం చేసి సహస్రనామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వాదళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి టీకాల కార్యక్రమం

నరసరావుపేట: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.రవి శనివారం తెలిపారు. ఆశ కార్యకర్తలు టీకాలు సక్రమంగా తీసుకోని వారిని గుర్తించినట్లు చెప్పారు. అందులో 64 మంది గర్భిణులు, 594 మంది పిల్లలు ఉన్నట్లు వివరించారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల పనివారు, వలస కూలీలు, పట్టణ మురికివాడలలో నివసిస్తున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు తమ బిడ్డలకు టీకాలు ఇప్పించి వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరంలోని పట్టాభిరామయ్య కాలనీ, గండాలయ్య పేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర శిశు సంక్షేమ శాఖ బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిస్తున్న పౌష్టికాహారం, నిర్వహణను పరిశీలించారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి కేంద్రం నుంచి వచ్చిన శిశు సంక్షేమ శాఖ కేంద్ర బృందానికి ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందంతో పాటు తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు బాంధవుడు జగనన్న

- మిచాంగ్ తుఫాన్‌ను సమర్థంగా అధిగమించారు
- ఉనికి కాపాడుకునేందుకే చంద్రబాబు కుటిల యత్నాలు
- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: రైతు పక్షపాతి, రైతు బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మిచాంగ్ తుఫాన్‌తో పంట దెబ్బతినటంతో రైతులు నష్టపోయారని, రైతాంగాన్ని సీఎం వైఎస్ జగనన్న ఆదుకుంటారని అన్నారు. వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికలతో ముందస్తుగా ఆయా ప్రాంతాలకు అత్యవసర నిధులు మంజూరు చేసి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా సీఎం చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పంట బాగా దెబ్బతిన్న ప్రాంతాలలో సీఎం జగనన్న పర్యటించి పంటను పరిశీలించి రైతులకు నష్టపరిహారాన్ని సంక్రాంతి పండగ నాటికి అందజేస్తానని భరోసా ఇచ్చారని చెప్పారు.

కరువు, చంద్రబాబు కవలలు..

కరువు, చంద్రబాబు నాయుడు కవల పిల్లలు వంటి వారన్న నానుడి ప్రజల్లో ఉందని ఎంపీ చెప్పారు. చంద్రబాబు పాలనా కాలంలో చుక్కనీరు అందక పంటలు ఎండిపోయిన పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు. 14 సంవత్సరాల పాలనా కాలంలో చంద్రబాబు రైతుల కోసం సానుకూలంగా ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. నాడు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు, నేడు రైతుల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. కేవలం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే మాట్లాడుతున్నారని, పదవి కోసం పగటి కలలు కంటున్నారన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు కొత్త పుస్తకాలు అందజేత

వేమూరు/కొల్లూరు/భట్టిప్రోలు: మిచాంగ్ తుఫాన్ వలన ఇళ్లలోకి నీరు చేరి తడిసిపోయిన విద్యార్థుల పాఠ్య పుస్తకాలకు బదులు ప్రభుత్వం నూతన పుస్తకాలను అందజేసింది. శనివారం వేమూరు అంబేడ్కర్ నగర్, కొల్లూరు మండలం తోకలవారిపాలెం, భట్టిప్రోలు మండలం ఆళ్లమూడిలోని విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్లి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పాఠ్యపుస్తకాలు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. పాఠ్య పుస్తకాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి, డీఈఓ పీవీజే రామారావు, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, ప్రత్యేకాధికారి జోత్స్న, వేమూరు, భట్టిప్రోలు ఎంఈఓలు వెంకటేశ్వర్లు, పులి లాజర్, నీలం దేవరాజులు, విద్యా శాఖ అధికారి రోజ్ ల్యాండ్, కోనేటిపురం సర్పంచి రాంబాబు పాల్గొన్నారు.



వేమూరులో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్

విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- ఎన్నికల హామీలను 99 శాతం అమలు
- వెనుకబడిన వర్గాల ఉన్నతికి 56 కార్పొరేషన్లు ఏర్పాటు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరు ఎన్‌జీఓ కాలనీలోని మహాత్మాగాంధీ కళాశాల ఆవరణలో 'కుల గణన'పై చర్చ కార్యక్రమం, సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు శాంతమూర్తి అధ్యక్షత వహించారు. కొమ్మినేని మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, మీడియా సంస్థలు అబద్ధపు వార్తలను పుంఖాన పుంఖాలుగా రాస్తున్నాయని మండిపడ్డారు. రోజురోజుకి దిగజారి వార్తలు వస్తున్నాయని విమర్శించారు. చివరికి కొన్ని మీడియా సంస్థలు ఉగ్రవాద సంస్థలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభూత కల్పనతో ఈనాడు, ఆంధ్రజ్యోతి అబద్ధపు వార్తలను అచ్చువేస్తున్నాయని విమర్శించారు. అటువంటి వార్తలను కళ్లు ఉండి రాస్తున్నారా లేక రాస్తున్నారా అనేది అర్థం కావడంలేదన్నారు. రాష్ట్రంలో దుష్ట పాలన సాగుతుందని చంద్రబాబు చేసిన వ్యాఖ్యాలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారని, చంద్రబాబు 92 శాతం హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు.

కుల గణనతో మేలు..

కుల గణనతో మేలు జరుగుతుందనే ఒక మంచి ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని కొమ్మినేని చెప్పారు. ఏపీలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ఒక రికార్డు అని, దేశ చరిత్రలో ఎప్పుడు లేదని వివరించారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కుల గణన చాలా అవసరమని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చొరవ అభినందనీయమని అన్నారు. సమాచార కమిషనర్ జొనాథన్ శామ్యూల్ మాట్లాడుతూ కులం, పుట్టుకపై ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశోధన చేశారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ కుల గణన చేపట్టడం శుభపరిణామమని చెప్పారు. మహాత్మాగాంధీ కళాశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాజిక న్యాయం చేయాలంటే కుల గణన తప్పనిసరి అని పేర్కొన్నారు. కుల గణన చేపట్టేందుకు ముందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు అభినందనలు చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీలో సాధికారితను అమలు చేశారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. విశ్రాంత ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి, హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యులు డీఆర్ శ్రీనివాసరావు, జీఎంసీ డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ బూసి రాజలత, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు రోజారాణి, డాక్టర్ శ్రీనివాసరావు, కారుమంచి రవికుమార్, తిలక్ ప్రసంగించారు.



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి డొక్కా తదితరులు

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- ఏఎన్‌యూలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం

ఏఎన్‌యూ: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న నాలుగో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను అప్పిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో యోగా ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. ఏపీని సంపూర్ణారోగ్యాంధ్రగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ ఎం విష్ణువర్ధన్‌రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, విజయ డెయిరీ చైర్మన్ సీహెచ్ ఆంజనేయులు, ఏఎన్‌యూ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్, లీగల్ అడ్వయిజర్ జి.వెంకట శివరామకృష్ణ ప్రసాద్, బిక్షమయ్య, యోగ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ బాలు, జి. వెంకట రామకృష్ణప్రసాద్, జి అనిల్, బైసు మల్లికార్జున, రాష్ట్ర భారత స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు గురూజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి

దాడికి పాల్పడిన ముగ్గురు యువకులు

వేటపాలెం: మద్యం మత్తులో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈఘటన మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెం రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కొణిజేటి నగర్‌కి చెందిన షేక్ నాగూర్ మీరావలి బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గల హోటల్‌లో బిర్యానీ పార్శిల్ తీసుకొని కాలనీకి వెళ్తున్నాడు. ఆ సమయంలో మార్గం మధ్యలో రిక్షా కాలనీ వద్ద మాధవ్ అనే యువకుడు నాగూర్ మీరావలితో మద్యం మత్తులో గొడవ పడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు ఇద్దరికి సర్దిచెప్పి పంపించారు. నాగూర్ మీరావలి కొద్ది సేపు తరువాత తిరిగి హోటల్ వద్దకి బైక్‌పై వస్తున్నాడు. ఇది గమనించిన మాధవ్, చిన్నా, మరో యువకుడు ముగ్గురు కలిసి మీరావలిపై తిరిగి దాడికి పాల్పడ్డారు. దాడి సమయంలో చిన్నా అనే యువకుడు మీరావలి పైకి కత్తి విసిరేశాడు. కత్తి పొట్ట కుడివైపు తగలడంతో మీరావలికి గాయమైంది. అక్కడే ఉన్నవారు చూసి కేకలు వేయడంతో ముగ్గురు పారిపోయారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన మీరావలిని చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అవుట్ పోస్టులో కేసు నమోదు చేశారు.

తల్లి మందలించిందని యువతి బలవన్మరణం

నాదెండ్ల: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడి, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన నావూరి శివ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వీరికి ఇరువురు కుమార్తెలు. రెండో కుమార్తె అఖిల (19) డిగ్రీ పూర్తి చేసి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. అయితే ఈ నెల 3వ తేదీన అఖిల డ్యూటీకి వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. అదేరోజు ఉదయం 9.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, శనివారం ఉదయం 9.30 గంటలకు తుదిశ్వాస విడిచింది. తండ్రి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- ఎమ్మెల్సీ పోతుల సునీతతో కలిసి పరికరాలు అందజేత

బాపట్ల: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ప్రతి నెలా పెన్షన్ అందించటంతో పాటు వారికి ద్విచక్రవాహనాలు, పరికరాలు అందిస్తోందని కోన తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరిగిందని తెలిపారు. దివ్యాంగులకు దుప్పట్లు, పరికరాలు అందించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు దుప్పట్లు, పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

చంద్రబాబు ఓట్ల షో ..!

- వంటల పరిశీలన పేరుతో రోడ్ షోలు
- వేమూరు, రేపల్లె, బాపట్ల, పర్చూరులలో రెండు రోజుల పర్యటన
- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిందలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మిచాంగ్ తుఫాన్ ప్రాంతాల పరిశీలన పేరుతో చంద్రబాబు శుక్ర, శనివారాలలో జిల్లాలో జరిపిన పర్యటన ఓట్ల షోగా సాగింది. తన పాలనలో రైతులకు మేలుచేశానని అబద్ధాలు వల్లవేశారు. ఏనాడు ఇవ్వని పరిహారాన్ని, ఇన్స్యూరెన్స్‌లు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకున్నారు. నీటమునిగిన ఇళ్లకు నిత్యావసరాలు ఇచ్చానన్నారు. అంతటితో ముగిస్తే సరే..! తనను తిరిగి గెలిపిస్తే అన్ని పరిహారాలను రెండింతలు, మూడింతలు చేస్తానంటూ రాసుకొచ్చిన లెక్కలు చదివి వినిపించి చంద్రబాబు ఆద్యంతం ఓట్ల రాజకీయానికి తెరతీయడంపై సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు రైతుల గోడు పట్టించుకోక తప్పులు చేసి ఇప్పుడు మళ్లీ అధికారం పొందేందుకు బాబు ఆరాట పడుతున్నారు. ఏదేదో చేస్తానని హామీలు గుప్పిస్తున్నారు. తన పాలనలో రైతాంగానికి, వ్యవసాయ రంగానికి ఏమీ చేయలేదన్న విషయం తెలిసిన జిల్లా రైతాంగం ఆయన హామీల వర్షానికి తడిసి ముద్ద కావడంలేదు. చంద్రబాబు ఎన్ని మాటలు చెప్పినా జనం ముఖ్యంగా రైతాంగం నమ్మడంలేదు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆయన తండ్రిలాగే వ్యవసాయరంగానికి పెద్ద పీట వేశారు. రైతులను కళ్లలో పెట్టి చూసుకున్నారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగగా మారితే, జగన్ పాలనలో పండుగలా మారింది.
- జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వచ్చిన చంద్ర బాబు ఇవన్నీ పక్కన బెట్టారు. తన హయాంలోనే రైతులకు మేలు జరిగిందన్నట్లు కొత్త పల్లవి అందుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు తీవ్రంగా అన్యాయం జరుగుతోందంటూ విమర్శలు గుప్పించారు. పర్యటన ఆసాంతం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం, వై.ఎస్.జగన్‌ను పనిగట్టుకుని విమర్శలు చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారు. రైతు వ్యతిరేకిగా ముద్రపడిన బాబు ఇప్పుడు రైతులపై ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడిన మాటలు విని రైతులు, ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఏనాడూ రైతుల గోడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఓట్ల కోసం రైతులపై ప్రేమను ఒలకబోస్తున్నారని విమర్శిస్తున్నారు. తుఫానుకు దెబ్బ తిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి పరిహారం విషయంలో సూచన చేయాల్సిన చంద్రబాబు అది చేయకుండా రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే పెద్ద మొత్తంలో పరిహారం ఇస్తానంటూ ఓట్ల రాజకీయానికి తెరలేపడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

తెలుగు మహాసభల జిల్లా సంచాలకుడిగా పేరిరెడ్డి

జనవరిలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు

ఇంకొల్లు (చినగంజాం): రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు-2024 బాపట్ల జిల్లా ఉత్సవ కమిటీ సంచాలకుడిగా ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు 2024 జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ప్రధాన సంచాలకులు కేశిరాజు రామప్రసాద్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు.



విద్యార్థులను శ్రద్ధగా చదివించండి

- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- తుఫాన్ బాధిత విద్యార్థులకు కొత్త పుస్తకాలు
- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందజేసిన వైనం


విద్యార్థిని సౌమ్యతో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

కర్లపాలెం: తల్లిదండ్రులు విద్యార్థులను శ్రద్ధగా చదివించాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల కర్లపాలెంలో పూరిగృహాలలోకి నీరు చేరి పుస్తకాలు తడిచిన విద్యార్థుల ఇళ్లకు శనివారం ప్రవీణ్ ప్రకాష్ వెళ్లి తడిచిన పుస్తకాలు పరిశీలించి విద్యార్థులకు కొత్త పుస్తకాలు అందజేశారు. కర్లపాలెం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సంజీవులు ఇంటికి వెళ్ళి కొత్త బుక్స్ అందజేశారు. అలాగే ఇందిరానగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 2వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కుమార్‌కు, 3వ తరగతి చదువుతున్న అయ్యప్పకు, పాతనందాయపాలెంలో 5వ తరగతి చదువుతున్న మహేశ్వరరెడ్డికి, గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సౌమ్యకు, మర్రికట్టవ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఉమామహేశ్వరరావుకు ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి కొత్త పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారని తెలిపారు.


ఇందిరానగర్‌లో విద్యార్థి యశ్వంత్‌కుమార్‌కు పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

అయితే తల్లిదండ్రులు తమ పిల్లలు సక్రమంగా బడికి వెళుతున్నారా, పాఠాలు చదువుతున్నారా అని ప్రతిరోజూ పరిశీలించాలని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం చదువుకోవటం, హోంవర్క్ పూర్తి చేయటం లాంటివి తల్లిదండ్రులే అలవాటు చేయాలని చెప్పారు. మీ కష్టాలు మీ పిల్లలకు రాకుండా ఉండాలంటే వారిని శ్రద్ధగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట బాపట్ల డీఈఓ పీవీజే రామారావు, డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, బాపట్ల ఎంఈఓ ప్రసాద్, కర్లపాలెం ఎంఈఓలు టీయూ మనోరంజని, విజయశ్రీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎక్కువ ఓటరు దరఖాస్తు చేసిన వారిపై కేసులు

ఎన్నికల అధికారులకు పల్నాడు కలెక్టర్ శివశంకర్ సూచన

నరసరావుపేట: ఎక్కువ సంఖ్యలో ఓటరు దరఖాస్తు చేసిన వారిపై పోలీసులచే సమగ్ర విచారణ నిర్వహించి అనంతరం అవసరమైతే వారి మీద సెక్షన్ 31 కింద కేసులు నమోదు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎలక్ట్రోరల్ అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ప్రత్యేక సారాంశ సవరణ-2024 పై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్న వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పలు రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలపై కులంకశంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శాశ్వత వలసలు, తాత్కాలిక వలసలు, డబుల్ ఎంట్రీలపై అవసరమైన వారికి నోటీసులు ఇచ్చి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగింపు విషయంలో క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్ల వయసు నిండిన వారిపై ప్రాస్పెక్టివ్ ఓటర్ నమోదు ప్రక్రియను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన విధులను అతి జాగరూకతతో నిర్వహించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

మట్టి పెళ్లలు విరిగిపడి కార్మికుడు మృతి

మార్టూరు: క్వారీలో ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు విరిగిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈఘటన నాగరాజుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మొహిద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన అర్జున్ యాదవ్ (36) స్థానికంగా ఓ స్టోన్ క్రషర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు క్రషర్‌లోని మట్టి పెళ్లలు జారి అర్జున్‌యాదవ్‌పై పడటంతో స్థానికులు గమనించి మట్టి పెళ్లలను తొలగించి పక్కకు లాగారు. అప్పటికే అర్జున్ యాదవ్ మృతి చెందినట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అనంతరం అర్జున్ యాదవ్ మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహం



మార్టూరు: గత నాలుగు రోజులుగా కన్పించకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు సాగర్ కాలువలో శవమై కన్పించాడు. ఈఘటన శనివారం ఉదయం ద్రోణాదులలో వెలుగు చూసింది. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు వివరాల మేరకు.. ద్రోణాదులలో నివాసముంటున్న చింతా నాగేశ్వరరావు (74) గత మంగళవారం పెన్షన్ తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం బంధువులు ఎంత వెతికినా ప్రయోజనం కన్పించలేదు. ఈక్రమంలో ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాల మధ్యగల సాగర్ కాలువలో తేలియాడుతున్న ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో భాగంగా మృతదేహం నాగేశ్వరరావుదిగా గుర్తించిన ఎస్ఐ మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.